**అ**నగా అనగా ఒక ఆవు. ఆవునే 'గోవు' అని కూడా అంటారు. ఆంగ్లంలో 'కోవు' అంటారు. అదే అలా అలా 'కోవ్'గా మారి, తర్వాత 'కౌ' అనే ఏకాక్షరంగా అయిపోయిందని, పరిశోధనమే జీవితాశయంగా భావించే పండితుల అభిప్రాయం.

# ఆవు-పులి

– రావి కొండలరావు



**ఆ** ఆవు ఒకానొక అడవిలో ఆకలికి ఆవురావుమని మేస్తోంది. ఏ ప్రభుత్వమైనా వచ్చి పశుగ్రాసంమీద పడి కబళించేస్తుందేమోనన్న భయంతో, గబగబా చకచకా మేసేస్తున్నట్టుంది ఆ ఆత్రుత చూస్తే. ఆధునికయుగంలోని కొందరు తల్లుల్లాగా కాకుండా "తల్లిపాలే బిడ్డలకు శ్రేష్ఠమైనవి" అని నమ్మి ఆ పాలు దూడకు మురిపాలతో పంచి ఇవ్వా అందుకు తాను పుష్టికరమైన ఆహారం తీసుకోవాలనీ ఆ ఆవు ఆహారం తీసుకుంటోంది ఓ పక్క విహారం కూడా కానిస్తూ. మందతో కలిసొచ్చిన ఆవు అలా అలా తింటూ పోవడంతో మందకి దూరమైంది. దాన్ని మందలించి మందకి తరలించే పశువులకాపరి కూడా దూరమైపోయాడు. మందల్ని తోలి తోలి మందబుద్ధి అయిపోయినట్టున్నాడు. కాలుష్యం, వాహనాల శబ్దాలు, పెద్ద పెద్ద గొట్టాల్లో రాజకీయ నాయకుల ఉపన్యాసాలు, పొగ, రొద, గోలా లేని హాయి అయిన వాతావరణం. చల్లని గాలి. అడ్డె లేకుండా దొరికిన ఓ పచ్చని చెట్టునీడన చక్కగా నిద్రపోతున్నాడు. పచ్చగడ్డి మేస్తున్న ఆవు అలా అలా అడవిలోకి చొచ్చుకుపోయింది. అది కాకులు దూరని కారడవీ, చీమలు చొరని చిట్టడవీ. అయినా పులులూ, సింహాలూలాంటి పెద్ద జంతువులన్నీ దూరగలవు. అలా దూరి, స్థిరనివాసం ఏర్పరచుకున్న ఓ పులి ఆకలితో ఆవురావుమని ఉండగా ఈ ఆవు కనిపించింది. "ఆహా ఆవు! తెల్లని గోవు. నా పంట పండెగా, నా కడుపూ నిండెగా!" అని

అంత నీరసంలోనూ ఎగిరెగిరి నాట్యం చేస్తూ పాడింది. స్టేజి యాక్టరు పద్యంలా మరీ గట్టిగా పాడితే, చెవులు మూసుకుని ఆవు పారిపోతుందని, తాను నోరు మూసుకుని, పొద పక్క నక్కి ఆవు అటు రాగానే ఒక్క దూకు దూకి ఎదురుగా నిలబడింది - విలన్‌లాగా మీసం దువ్వుతూ. "అంబా! వ్యాఘ్రం!" అంది ఆవు భీత నేత్రాలతో. "మరీ అంత పెద్ద మాటక్కర్లేదు. పులి అను చాలు. నీ మొహాన్నీ, నన్నూ కలిపి 'గోముఖ వ్యాఘ్రం' అంటారు మనుషులు - దుర్మార్గుణ్ణి. అసలు నేను దుర్మార్గుణ్ణి కాను. నువ్వు ప్రాణంగల గడ్డిని ఆహారంగా ఎలా తింటున్నావో, అలాగే నిన్నూ నేను ఆహారంగా తీసుకుంటాను. అంతమాత్రాన నేను క్రూరమృగాన్నా? అంచేత నీవే నాకు ఆహారం! నీవే నాకు ఆధారం!" అంది పులి. "పులీ! నన్ను క్షమించు! నీకు ఆహారంగా రావడానికి నాకెలాంటి అభ్యంతరమూ లేదు. ఆనందంగా వస్తాను. ఆకలిగొన్న నీలాంటివాడికి కడుపునిండా ఇంత ఆహారం పెట్టడమే జన్మకు సార్థకం అని వేదాలు ఘోషిస్తున్నాయి. కానీ ఒక్క మాట విను. నాకున్నది ఒక్క దూడ. దానికి ఆహారం ఇచ్చే వేళయింది. అది నాకోసం ఎదురు చూస్తూంటుంది. వెళ్లి, దానికిన్ని పాలు పట్టి వెంటనే వస్తాను. నా బిడ్డను రక్షించు. తిరిగి రాగానే నన్ను భక్షించు!" అంది ఆవు ఆనందంగా. ఆ శార్దూల శ్రేష్ఠుడు హిరణ్యకశిపుడు, బకాసురుడు, కంసుడూ కలిసి నవ్వితే ఎలా ఉంటుందో, అలాంటి నవ్వు నవ్వాడు. ఆ నవ్వుకి అడవి అదిరింది. ఆవు బెదిరింది. "ఏమీ! ఏమంటివే మృగాధమా! నీవు పోయి నీ బిడ్డకు క్షీరమిచ్చి, తిరిగి వచ్చి నా కాహారమయ్యెదవా - వెధవా! మనుషుల మధ్య మసలి మాయమాటలు అలవర్చుకున్నావన్నమాట! అలాంటి మాటలు నమ్మడానికి నేనేం అమాయక ఓటరుననుకుంటున్నావా? అదేం కుదరదు. చచ్చినట్టుండాల్సిందే, నిన్ను నేను చంపాల్సిందే!' ' అని పంజా ఎత్తి ఒక్క దూకు దూకబోయింది పులి. ఆవు నాలుగుచేతులతో నమస్కరించింది.



"పులీ! నేను మనిషిలాంటిదాన్ని కాను. నన్ను మనిషితో సరిపోల్చకు. నన్ను పూజించినట్టే పూజించి, నా పాలు తాగి రొమ్ము గుద్ది భక్షించే నీచ మానవులకంటె నువ్వు ఎంతో గొప్పదానివి. నేను అబద్ధం చెప్పను. నాకు తెలీదు కూడా. నన్ను నమ్ము. త్రికరణశుద్ధిగా చెబుతున్నాను. యుగయుగాలుగా వస్తున్న గోవంశంమీద ప్రమాణం చేసి చెబుతున్నాను. నాబిడ్డకు పాలిచ్చి వెంటనే వచ్చేస్తాను. నువ్వు ఇక్కడే ఉండు!" అంది. ఎంత క్రూరజంతువయినా, పులికీ పాపం జాలి ఉంది. ఆవు మాటని నమ్మింది. "సరే, వెళ్లు! సూర్యాస్తమయం దాటకుండా రావాలి సుమా!" అంది. ఆవు పరుగెత్తింది. మేస్తున్న మందలో కలవకుండా, అశ్వధాటితో, శరవేగంతో పరుగెత్తింది. "అంబా!" అని అమ్మని పిలుస్తున్న బిడ్డని కలుసుకుంది. ప్రేమతో ఒళ్లంతా నిమిరింది. కడుపునిండా పాలుపట్టింది. జరిగిన విషయం చెప్తే దూడ భయపడుతుంది. "ఇప్పుడే వస్తాను, నాయనా!" అంటే అది అబద్ధమవుతుంది. అంచేత ఏమాటా చెప్పకుండా అడవి దారి పట్టింది ఆవు.

ఆవు - గుర్రంలా పరుగెత్తుతూ ఉంటే రోడ్డుమీద మసలే జనం వింతగా చూడసాగారు. అందులో కొందరు దాని రూపురేఖలమీద కన్నేశారు. "ఎవరిదో ఆవు. కట్టు తప్పినట్టుంది. మన చేజిక్కింది. హెహ్హెహ్హె ... రండ్రా!" అని ఓ నలుగురు బొర్ర మీసాలవాళ్లు తలపాగాలు దులిపి, ఆవుని అడ్డుకున్నారు. "సాధు జంతువుని కనుక, న్యాయంగా ప్రతిఘటించకూడదు. కానీ ప్రస్తుతం నేను అడవిలోని పులికి ఆహారాన్ని. నన్ను విడిచిపెట్టండి!" అంది ఆవు బతిమాలుతూ. రౌడీలు, అడవిలో పులి నవ్విన దానికి నాలుగురెట్ల శబ్దంతో నవ్వారు. "పులికి ఆహారంగా వెళ్తున్నావా! ఎవరిదగ్గర చెప్తావే మాయమాటలు! రా! కబేళాకి తోలుకెళ్లి తోలు తీస్తాం!" అంటూ - ఆవు ఎంత బతిమాలి, ప్రార్థించి, ఏడ్చి మొత్తుకున్నా వినకుండా గొడ్డును బాదినట్టు బాది, లాక్కెళ్లారు వాళ్లు.

ఆవురావురుమంటూ "ఆవూ! ఆవూ! ఇధరావూ ... మేరా పాస్ ఆవు!" అని కలవరిస్తున్న అడవిలోని పులి, ఆవుకోసం చూసి చూసి విసుగెత్తిపోయింది. "ఛీ! ఇంత దుర్మార్గుణ్ణి. అనవసరంగా ఆవు మాట నమ్మి బేలనైతినే! దుర్మార్గుడు ఎప్పుడూ దుర్మార్గంలోనే ఉండాలి కానీ, సన్మార్గం తొక్కకూడదు. సాధుజంతువనీ, గోవులాంటిదనీ దాని మాట నమ్మినందుకు తగిన శిక్ష జరిగింది. అయినా నీతిమాలిన మనుషులమధ్య తిరిగే ఆవుకి మాత్రం నీతి ఎలా ఉంటుంది? అసలు ఆవు జాతినే కాదు, ఎప్పుడూ ఎవర్నీ నమ్మకూడదు. ఛీ!" అని కాండ్రించి ఉమ్మి, గాండ్రించి, పొట్ట చేత్తో పట్టుకుని ఆహారంకోసం అడవినే నమ్ముకుంది పులి.